www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 18 మే 2023
5
ఏలూరు

వడదెబ్బకు ఇద్దరు మృతి

మండవల్లి:వడదెబ్బకు మహిళ మృతి చెందిన ఘటన పామర్రు - దిగమర్రు జాతీయ రహదారిపై భైరవపట్నం రైల్వే గేట్ వద్ద బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం కొవ్వాడలంక గ్రామానికి చెందిన జల్లూరి ప్రసాదరావు భార్య జయలక్ష్మి చేపల వేట సాగిస్తూ జీవనం సాగిస్తుంటారు. రేపల్లెలో చేపలవేటకు వారంరోజులు క్రితం వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వచ్చేందుకు రేపల్లె నుండి వస్తున్న చేపల లారీ ఎక్కారు. భైరవపట్నం వద్ద రైల్వే గేటువద్ద లారీ దిగి, ఇంటి వెళ్లేందుకు మరో ఆటో కోసం రోడ్డుపక్కన నిలబడ్డారు. ఈ తరుణంలో జయలక్ష్మి ఒక్కసారిగా కళ్లు తిరిగి అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతిచెందింది.

ఏలూరు స్పోర్ట్స్ : గుర్తు తెలియని వ్యక్తి(50) వడదెబ్బకు మృత్యువాత పడ్డాడు. ఏలూరు ఆశ్రం ఆసుపత్రి సమీపంలోని బస్ షెల్టర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందాడు. ఏలూరు రూరల్ ఎస్ఐ ఎస్.లక్ష్మణబాబు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వడదెబ్బ వల్లే అతను మరణించినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించారు.

కట్..కట్..!

కరెంటు కోతలతో జనం విలవిల
గ్రామాల్లో ఐదు గంటలుపైనే కోత
పట్టణాల్లోనూ గంటలు తరబడి కోతలే
ప్రతిరోజూ 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు
ఉక్కపోతతో తల్లడిల్లుతున్న జనం
ఆక్వా రైతుల పరిస్థితి అగమ్యగోచరం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కరెంటు కోతలతో జిల్లా ప్రజానీకం తల్లడిల్లుతున్నారు. రోజువారీ విద్యుత్ వినియోగం 22 మిలియన్ యూనిట్ల నుంచి 23.5 మిలియన్ యూనిట్లకు పెరిగిందంటూ లోడ్ రిలీఫ్ పేరుతో ఎడాపెడా కరెంటు కోతలు అమలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో రెండు జిల్లాల ప్రజానీకం పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 10 లక్షలకుపైగా గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. దీనిలో పేద, మధ్యతరగతి విద్యుత్ ప్రజల కనెక్షన్లే అధికం. గడిచిన మూడు రోజులుగా జిల్లాలో ప్రతిరోజూ 45 డిగ్రీలకుపైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేడిగాలులకు జనం విలవిల్లాడుతున్నారు. ఇంటి నుంచి బయటికి రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. ఎండలకు తట్టుకోలేక ఇంట్లో ఉన్న కరెంటు కోతలతో ఉపశమనం లేని పరిస్థితి ఏర్పడింది. లోడ్ రిలీఫ్ పేరుతో సమయం, సందర్భం లేకుండా ఇష్టానుసారంగా కరెంటు కోతలు అమలు చేస్తున్నారు. జిల్లా కేంద్రమైన ఏలూరు నగర పరిధిలోని తంగెళ్లమూడిలో మంగళవారం రాత్రి 8.30 గంటలకు తీసేసిన కరెంటు తెల్లవారే వరకూ ఇవ్వని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించకపోవడంతో జనం రోడ్డెక్కి ఆందోళన చేశారు. ఏలూరు పట్టణ కేంద్రంలోనే అర్ధరాత్రి గంటకుపైగా కరెంటు కోత కొనసాగింది. భీమడోలు మండలం పోలసానిపల్లిలో నాలుగైదు గంటలు కరెంటు కోత పెట్టడంతో జనం అల్లాడిపోయిన పరిస్థితి నెలకొంది. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి గ్రామంలోనూ కరెంటు కోతల బాధలు జనాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతున్నాయి. గ్రామాల్లో అయితే ఇష్టానుసారంగా కరెంటు కోతలు అమలవుతున్నాయి. పలు గ్రామాల్లో రోజుకు నాలుగైదు గంటలు కోతలు కొనసాగుతుండగా,



కొన్ని గ్రామాల్లో ఏడెనిమిది గంటలు సైతం కోతలు విధిస్తున్నారు. ఇన్వర్టర్లు ఉన్నవారు కొంత ఉపశమనం పొందుతుండగా, లేనివారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రాత్రంతా నిద్ర లేకుండాపోతోంది. పగలూ రాత్రి ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఉక్కపోతకు తాళలేక పిల్లలు గుక్కపెట్టి ఏడుస్తుండటంతో వారిని బుజ్జగించడంతోనే రాత్రంతా గడిచిపోతోంది. బిల్డింగ్‌పైన సేదతీరుదామని వెళ్లినా దోమల ధాటికి తట్టుకోలేని పరిస్థితి నెలకొంది. డెల్టా, మెట్ట ప్రాంతం అనే తేడా లేకుండా కరెంటు కోతలు అమలవుతున్నాయి. విద్యుత్ వినియోగం పెరగడంతో అనధికారికంగా లోడ్ రిలీఫ్ పేరుతో కరెంటు కోతలు అమలు చేస్తున్నారు. ఎండల తీవ్రత పెరుగుతున్న తరుణంలో వెంటాడుతున్న కరెంటు కోతలు జనాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

ఆక్వా రైతుల పరిస్థితి అగమ్యగోచరం

కరెంటు కోతలతో ఆక్వా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉష్ణోగ్రతలు పెరగడంతో రొయ్యల సాగు కత్తిమీద సాములా మారింది. చెరువుల్లో ఆక్సిజన్ లెవెల్ తగ్గకుండా ఉండాలంటే నిరంతరం రేడియేటర్లు తిప్పాలి. రేడియేటర్లు ఆడించాలంటే కరెంటు ఉండాలి. కరెంటు కోతలతో జనరేటర్లతోనే రేడియేటర్లు ఆడించాల్సి వస్తోంది. దీంతో ఖర్చు తడిసిమోపెడవుతుండటంతో ఆక్వా రైతులు బెంబేలెత్తిపోతున్నారు. రెండు జిల్లాల్లోనూ దాదాపు రెండు లక్షలకుపైగా ఎకరాల్లో ఆక్వా సాగు సాగుతోంది. దీనిలో అత్యధికంగా రొయ్యల సాగే ఉంది. ఇప్పటికే సరైన ధరలేక రొయ్యల సాగు చేసే రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ఇప్పుడు కరెంటు కోతలతో ఎకరాకు దాదాపు రూ.లక్ష వరకూ అదనపు పెట్టుబడి అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. వేసవి తీవ్రత ఇదేవిధంగా కొనసాగితే ఆక్వా రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారనుందని చెబుతున్నారు.

బదిలీలకు గ్రీన్ సిగ్నల్

ఒకేచోట రెండేళ్లు పూర్తయిన వారికి బదిలీ అవకాశం
రెండు జిల్లాల్లో 48 వేల మంది ఉద్యోగులు
బదిలీల్లో 20 శాతం ఉద్యోగులు కదిలే పరిస్థితి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 22 నుంచి 31వ తేదీ వరకూ బదిలీల ప్రక్రియ జరగనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఒకే స్థానంలో ఐదేళ్లు పని చేసినవారికి తప్పనిసరిగా బదిలీలు ఉండగా, రెండేళ్ల కాలం పూర్తి చేసుకున్న వారు వారి ఇష్టం మేరకు బదిలీలకు అర్హులుగా ప్రభుత్వం పేర్కొంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో రెవెన్యూ, ఎన్జిఒలతోపాటు వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు 48 వేల మంది వరకూ ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. బదిలీల్లో భాగంగా 15 నుంచి 20 శాతం మంది ఉద్యోగులకు స్థాన చలనం కలగనుందని చెబుతున్నారు. గత ఎన్నికల తర్వాత తహశీల్దార్లు వివిధ జిల్లాల నుంచి జిల్లాకు వచ్చారు. వీరికి ఐదేళ్ల కాలం పూర్తి కాలేదు. ఇటువంటి వారికి వారు కోరుకుంటేనే బదిలీ ఉంటుంది. బదిలీల ప్రక్రియకు గ్రీన్ సిగ్నల్ రావడంతో ఎప్పటినుంచో బదిలీల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగుల్లో హడావుడి మొదలైంది. తాము కోరుకున్న స్థానాలకు, సొంతూరుకు దగ్గర్లోకి వెళ్లేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.

ఎపి జెఎసి అమరావతి మూడోదశ ఉద్యమం

ఎంఎల్ఎకు ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎపి జెఎసి అమరావతి మూడో దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా 'ఉద్యోగుల వేదనను చెబుదాం' అనే నినాదంతో బుధవారం ఏలూరు ఎంఎల్ఎ ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని)ను కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన ఎంఎల్ఎ మాట్లాడుతూ ఉద్యోగుల ప్రధాన సమస్యలను సిఎం జగన్ దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్ కె.రమేష్‌కుమార్, జనరల్ సెక్రెటరీ బి.రాంబాబు, ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎ.ప్రమోద్ కుమార్, నాయకులు సిహెచ్.వర్మ, ఆర్.వీరబాబు, ఆర్.శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఆళ్ల నానికి వినతిని అందిస్తున్న నాయకులు

ప్రశాంతంగా ఎపి ఇఎపి సెట్ పరీక్ష

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎపి ఇఎపి సెట్ పరీక్ష మూడో రోజు బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఏలూరులోని మూడు కేంద్రాలైన వట్లూరులోని సిఆర్.రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, సిద్ధార్థ క్వెస్ట్, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలల్లో రెండు షిఫ్టులలో నిర్వహించిన ఈ పరీక్షకు మొత్తం 920 మందికి 893 మంది హాజరు కాగా 27 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకూ జరిగిన మొదటి షిఫ్ట్‌లో సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో 180 మందికి 171 మంది హాజరు కాగా తొమ్మిది మంది గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 130 మందికి 128 మంది హాజరుకాగా ఇద్దరు గైర్హాజరయ్యారు. అలాగే సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 150 మందికి 145 మంది హాజరయ్యారు. మొత్తం ఉదయం షిఫ్ట్‌లో 460 మందికి 444 మంది హాజరు కాగా 16 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఆరు గంటల వరకూ జరిగిన రెండోషిఫ్ట్‌లో సిద్ధార్థ క్వెస్ట్‌లో 180 మందికి 179 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 130 మందికి 126 మంది హాజరు కాగా నలుగురు గైర్హాజరయ్యారు. సిఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 150 మందికి 144 మంది హాజరు కాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. మొత్తం రెండో షిఫ్ట్‌లో 460 మందికి 449 మంది హాజరయ్యారు. 11 మంది గైర్హాజరయ్యారు.

రికార్డులు పరిశీలిస్తున్న గంజిమాల దేవి

అంగన్‌వాడీ కేంద్రాల్లో
అక్రమాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు గంజిమాల దేవి హెచ్చరించారు. మండలంలోని బందంచర్లలోని 1, 2 అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఒకటో నెంబరు అంగన్‌వాడీ కేంద్రంలో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించడం లేదని, హాజరు సక్రమంగా నిర్వహించడం లేదని, ప్రీ స్కూల్ పిల్లలు సరిగా హాజరు కావడం లేదని, కాలం చెల్లిన కంది పప్పు నాలుగు కేజీలు ఉన్నట్లు గుర్తించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఉదయ్, సిడిపిఒ పి.మాధవి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, సర్పంచి గుండె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో వైసిపి విఫలం

ప్రజాశక్తి - ముసునూరు

ఆకాలవర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సిపిఎం జిల్లా నాయకులు జి.రాజు విమర్శించారు. బుధవారం మండలంలోని ముసునూరు సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజు మాట్లాడారు. ఇ-క్రాప్ ఆధారంగా పొగాకు, మిర్చి, మొక్కజొన్న పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని గొప్పలు చెప్పడమే గానీ నేటి వరకూ ఆ నష్టపరిహారం రైతుల ఖాతాల్లో జమ కాకపోవడం అన్యాయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలను కొట్టి పెద్దలకు పెడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పిల్లి మురళీ, కంచర్ల దుర్గారావు, కంచర్ల శ్రీను, శ్రీను, నాగరాజు, పిన్నిబోయిన శ్రీనివాసరావు, పోట్రు శ్రీను ఉన్నారు.

ఏలూరులో రూ.2 కోట్లతో వాటర్ ఫౌంటేన్లు

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు నగరాన్ని సుందరీకరణ చేయడమే కాకుండా నగరంలో వాయు కాలుష్యం తగ్గించేందుకు దోహదపడేలా సుమారు రూ.రెండు కోట్లతో ఏడు ప్రాంతాల్లో వాటర్ ఫౌంటేన్లు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక సిఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ నుంచి పాత బస్టాండు, తంగెళ్లమూడి వంతెన, కండ్రికగూడెం సెంటర్, అశోక్ నగర్ వంతెన ప్రాంతాల్లో నగరపాలక సంస్థ అధికారులతో కలిసి కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు నగరవాసులకు స్వచ్ఛమైన గాలి, మంచి వాతావరణాన్ని అందించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలో అశోక్ నగర్ వంతెన డౌను, తంగెళ్లమూడి వంతెన వద్ద, జ్యూట్ మిల్లు సెంటర్‌లో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సిఎపి) నిధులతో, పాత బస్టాండు సెంటర్, ఫైర్ స్టేషన్ సెంటర్‌లో నగరపాలక సంస్థ నిధులతో, కండ్రికగూడెం, సిఆర్.రెడ్డి పబ్లిక్ స్కూల్ సెంటర్ వద్ద ఈడా నిధులతో వాటర్ ఫౌంటేన్ల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టి పూర్తిచేయాలని సంబందిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నగర మున్సిపల్ కమిషనరు ఎస్.వెంకటకృష్ణ, ఎస్ఇ వెంకటేశ్వరరావు, డిఇ సత్యనారాయణ, ఎఇ రాఘవేణి ఉన్నారు.

పాత పద్ధతిలోనే ఉపాధి పనులు చూపాలి

ఎపి వ్యకాస ఆధ్వర్యాన సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఉపాధి హామీ చట్టంలో పాత పద్ధతిలోనే సమ్మర్ అలవెన్స్, పే స్లిప్పులు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. నూజివీడు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి పెద్దఎత్తున కూలీలు తరలివచ్చారు. ఉపాధి హామీ రక్షణ కోసం జరుతున్న ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్.నరసింహ మాట్లాడారు. ఉపాధి హామీ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. ఈ క్రమంలోనే ఉపాధి హామీలో రెండో పూట పనివిధానం, నేషనల్ మొబైల్ మోనటరింగ్ ఫొటో పద్ధతి తీసుకువచ్చిందన్నారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు మెడికల్ కిట్లు, పనిముట్లు, మజ్జిగ, తాగునీరు వంటి సౌకర్యాలను కల్పించడం లేదన్నారు. మోడీ ప్రభుత్వం ఉపాధి హామీని నీరుగార్చే ప్రయత్నాలు చేస్తోందని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్లో ఉపాధికి రూ.రెండు లక్షల 50 వేల కోట్లు కేటాయించి చట్టాన్ని పరిరక్షించాల్సిన కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసేయాలని చూస్తుందన్నారు. బిజెపి ప్రభుత్వం ఉపాధి కూలీలపట్ల మొండిగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఉపాధి హామీ పని ప్రదేశాల వద్ద ఉపాధి హామీ కూలీలను కలుసుకుని వారి నుండి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రెండు పూటలా పని విధానం ఎత్తివేయాలని కోరారు. కేంద్ర బడ్జెట్‌లో నిధులు పెంచి చట్టాన్ని కాపాడాలన్నారు. కుటుంబానికి 200 రోజులు పని, కనీస వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. మేట్లకు పారితోషికం రూ.ఐదు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్‌పై రాజకీయ వేధింపులు ఆపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పని చేస్తున్న ప్రాంతాల్లో కూలీలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కూలీలు వడగాల్పులకు ఇప్పటికే జిల్లాలో నలుగురు ఉపాధి కూలీలు చనిపోయారని తెలిపారు. చనిపోయిన కుటుంబాలకు కనీసం ప్రభుత్వం ఎలాంటి పరిహారమూ ఇవ్వకపోగా వారిని ఆదుకునే ప్రయత్నం కూడా చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పనిచేస్తున్న క్రమంలో గ్రామాల్లో చెరువుల వద్ద ముళ్లపొదల్లో పనిచేస్తున్న సందర్భంలో విషపు పురుగులు, తేళ్లు పాములు కరిచి ప్రమాదాలు గురవుతున్నారని తెలిపారు. వారికి ప్రభుత్వం ఉచిత వైద్యం అందించాలని వైద్యంకు కావలసిన ఆర్థిక సహకారం కూడా అందించాలని డిమాండ్ చేశారు.



ధర్నా చేస్తున్న నాయకులు

బ్రిజ్ భూషణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలి

ఎపి మహిళా సమాఖ్య ఆధ్వర్యాన సంతకాల సేకరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మహిళా రెజ్లర్లపై లైంగిక దాడికి పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌సింగ్‌ను తక్షణం అరెస్టు చేయాలని ఎపి మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ కొండేటి బేబి డిమాండ్ చేశారు. స్థానిక పాతబస్టాండ్ వద్ద గల వాసవి సిల్క్స్ సెంటర్‌లో బుధవారం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా రెజ్లర్లకు మద్దతుగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా బేబి మాట్లాడుతూ బిజెపి ఎంపీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మహిళా రెజ్లర్లు 30 రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం చర్యలు చేపట్టకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. లైంగిక వేధింపులపై మహిళా మల్లయోధులు పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకపోవడం విచారకరమన్నారు. ఢిల్లీ నడిబొడ్డున రోజుల తరబడి యువతులు చేస్తున్న పోరాటం దేశాన్ని కదిలిస్తున్నా బిజెపి ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని విమర్శించారు. అంతర్జాతీయ క్రీడా పోటీల్లో దేశం పరువు నిలబెట్టిన యువతుల పరువు కాపాడాలన్న ఇంగిత జ్ఞానం కేంద్ర ప్రభుత్వానికి లేదన్నారు. మహిళా సమాఖ్య ఏలూరు నగర కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మిఇందిర మాట్లాడుతూ రెజ్లర్ల ఆందోళనల నేపథ్యంలో ఢిల్లీ మహిళా పోలీస్ కమిషన్ స్పందించి క్రీడా శాఖకు నోటీసులు జారీ చేసినా స్పందన కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడాకారుణుల ఫిర్యాదులను స్వీకరించడానికి, పరిష్కరించడానికి కఠిన నిబంధనలతో దర్యాప్తు సంస్థను నియమించాలని డిమాండ్ చేశారు. మహిళా క్రీడాకారుల ఆత్మవిశ్వాసాన్ని పెంచే విధంగా చర్యలు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నాయకురాలు కొల్లూరి సుధా రాణి, ఉప్పులూరి లక్ష్మీ, భవానీ, జోజి, మేరీ, పుప్పాల బాలాశ్రీలక్ష్మి, నిస్సీ, పూజ్యలక్ష్మీ, అరుణ పాల్గొన్నారు.

సంతకాలు చేస్తున్న మహిళలు

ప్రతిష్టాత్మకంగా జగనన్నకు చెబుదాం

ఏలూరు:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమం అమలుపై ప్రత్యేకమైన దృష్టి సారిస్తుందని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని గౌతమి సమావేశ మందిరం నుండి జెసి బి.లావణ్య వేణి, ఎస్‌పి మేరీ ప్రశాంతితో కలిసి జిల్లాలోని ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, పోలీస్ అధికారులు, మండల స్థాయి అధికారులతో జగనన్నకు చెబుదాం కార్యక్రమం అమలుపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల తొమ్మిదో తేదీన సిఎం జగన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమాన్ని పగడ్బందీగా నిర్వహించడానికి అవసరమైన చర్యలు చేపట్టారని చెప్పారు. ప్రతీ సోమవారం గ్రీవెన్స్ అర్జీల పరిష్కారం నాణ్యత, స్పష్టతతో, ఎండార్స్‌మెంట్ ఉండాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలిచ్చారు. గ్రీవెన్స్ అర్జీని 24 గంటల్లోగా ఓపెన్ చేయాలని, అలాగే సమస్యను పూర్తిగా చదివి, క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఫొటోలతో సహా నాణ్యతతో, రీ ఓపెనింగ్ లేకుండా, అర్జీదారుడు సంతకంతో ఎండార్స్ మెంట్‌ను అప్‌లోడ్ చేయాలని తెలిపారు. జిల్లాలో గ్రీవెన్స్ అర్జీలలో ఇటీవల రీఓపెనింగ్‌లు ఎక్కువగా వస్తున్నాయని, అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి రీ ఓపెనింగ్ అర్జీలు లేకుండా చూడాలని ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి సంబంధించిన వెబ్ సైట్‌లో పొందుపరచిన అంశాలను, వీడియో కాన్ఫరెన్స్‌లో పవర్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ మూర్తి, జెడ్‌పి సిఇఒ రవికుమార్, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదనరావు, వ్యవసాయ శాఖ జెడి రామకృష్ణ, డిఎల్‌డిఒ రమణ, డిఎస్‌పి శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

గిరిజనులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్

ప్రజాశక్తి - కుక్కునూరు

గిరిజన సంఘం నేతలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని సంఘం జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన గిరిజన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోయవాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం చేయడం సరికాదని, సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తున్నా గిరిజన ఎంఎల్ఎ తెల్లం బాలరాజు కూడా తీర్మానాన్ని వ్యతిరేకించకపోవడం గిరిజనులకు ద్రోహం చేయడమేనన్నారు. ఈ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ సంఘం ఆధ్వర్యంలో పోలవరం ఎంఎల్ఎ బాలరాజు తన వైఖరి తెలపాలని కోరినందుకు గిరిజన సంఘం జిల్లా నాయకులు తెల్లం రామకృష్ణ, కారం భాస్కర్‌పై ఎంఎల్ఎ అక్రమంగా కేసులు పెట్టించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ చర్యను గిరిజన సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఆదివాసీలకు అన్యాయం చేసే తీర్మానాన్ని ఉపసంహరించాలని, గిరిజనులకోసం పోరాడే సంఘం నాయకులపై పెట్టిన అక్రమకేసులు ఎత్తివేయాలి డిమాండ్ చేశారు.

బుట్టాయగూడెం:గిరిజన సంఘం నాయకులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని ఎపి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎంఎల్ఎ తెల్లం బాలరాజు తన వైఖరి తెలపాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, బుట్టాయగూడెం మండల అధ్యక్షులు కారం భాస్కర్ కోరినందుకు అక్రమంగా కేసులు పెట్టారని విమర్శించారు. ఈ తీర్మానం ఆదివాసీలకు అన్యాయం చేసే విధంగా ఉందని, సమాధానం చెప్పకుండా గిరిజనులను కలవకుండా తప్పించుకు వెళ్లిపోయి ఇరువురిపై బాలరాజు కేసులు పెట్టించారని విమర్శించారు. ఈ పిరికిపంద చర్యను గిరిజన సంఘం తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ఆదివాసీలకు అన్యాయం జరిగే తీర్మాణాన్ని వెంటనే రద్దు చేయాలని, 52 జీవోను తక్షణమే రద్దు చేయాలనీ ఆయన డిమాండ్ చేశారు. గిరిజనుల పక్షాన పోరాడే గిరిజన సంఘం నాయకులపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

పిట్టల్లా రాలుతున్నారు..!

తారెత్తిస్తున్న ఎండలు
రికార్డు స్థాయిలో 47 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
వణికిపోతున్న జనం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎండలు తారెత్తిస్తున్నాయి. ఎండ వేడికి జనం పిట్టల్లా రాలిపోతున్నారు. మండలంలో వారం రోజుల వ్యవధిలో వేడిగాలులకు, ఉక్కబోతకు వ్యాధిగ్రస్తులు, వృద్ధులు సుమారు పది మందికిపైగా మృత్యువాతపడ్డారు. ఎండల తీవ్రత ఏస్థాయిలో ఉందో దీన్నిబట్టి అర్థమవుతుంది. రికార్డుస్థాయిలో 47 డిగ్రీల పైబడి మండలంలో ఉష్ణోగ్రతలు నమోదుకావడంతో జనాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండలు, వేడి గాలులు, ఉక్కపోతలు, అప్రకటిత విద్యుత్ కోతలతో గ్రామీణ ప్రజానీకం అల్లాడుతుంది. మండలవ్యాప్తంగా గత మూడు రోజులుగా రికార్డుస్థాయిలో సరాసరిన 43 డిగ్రీల పైబడి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వృద్ధులు, వ్యాధిగ్రస్తులు వణికిపోతున్నారు. షుగర్, బిపి, కిడ్నీ వ్యాధులతో పాటు, దీర్ఘకాలవ్యాధులతో బాధపడుతున్న రోగులు ఎండలకు, వడదెబ్బలకు మృత్యువాత పడుతున్నారు. ఎండలకు మరణాలు సంఖ్య రోజురోజుకూ పెరగడంతో మండల ప్రజలు భయందోళన చెందుతున్నారు. మండిపోతున్న ఎండల బారినుంచి తప్పించుకునేందుకు ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. మరో రెండు వారాల పాటు ఈ నిప్పుల కొలిమి కొనసాగుతుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండటంతో ప్రజలు అందోళన చెందుతున్నారు. రానున్న రెండు వారాల్లో ఇంకా ఎంత మంది ఎండలకు బలి కావాల్సి వస్తుందోననే భయం మండల ప్రజల్ని వెంటాడుతోంది. తప్పనిసరి పరిస్థితుల్లో ఎండలో ప్రయాణించే వారు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

దత్తత పాపకు మంచి భవిష్యత్తు అందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

దత్తత పాప కొండాలమ్మను దత్తత తీసుకున్న తల్లిదండ్రులు మంచి ఉన్నత విద్యను అందించి, మంచి భవిష్యత్తు కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కోరారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్లో దత్తత స్వీకరణ కార్యక్రమంలో భాగంగా చట్ట ప్రకారం అన్ని అర్హతలతో దరఖాస్తు చేసుకున్న కేరళ రాష్ట్రానికి చెందిన రవీంద్ర పిళ్లే, ఉషా రవీంద్ర దంపతులు ఆడపిల్ల దత్తత కోసం 2015లో దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా బాలల సంరక్షణ గృహంలో ఉన్న పాప కొండాలమ్మ(9)ను జిల్లా మేజిస్ట్రేట్, దత్తత అధికారి జిల్లా కలెక్టర్ సమక్షంలో వారికి అప్పగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొండాలమ్మకు మంచి విద్యాబోధనలు చెప్పించి, మంచి భవిష్యత్తు కల్పించాలని కలెక్టర్ కోరారు.

దత్తత బాలికతో కలెక్టర్


మొబైల్ మజ్జిగ చలివేంద్రం వద్ద ప్రజలు

మొబైల్ మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండలంలో ఉచిత పంపిణీకి ప్రత్యేకించిన మొబైల్ మజ్జిగ చలివేంద్రం సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు ప్రత్యేకించిన సదరు మొబైల్ మజ్జిగ చలివేంద్రం బాధ్యతను శ్రీ లక్ష్మీనారాయణ ఫౌండేషన్‌కి చెందిన జనసేన పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్సమట్ల ధర్మరాజు స్వీకరించారు. ఈ చలివేంద్రాన్ని బుధవారం ధర్మరాజు ప్రారంభించారని పార్టీ భీమడోలు మండల అధ్యక్షులు ప్రతి మదన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ మజ్జిగ చలివేంద్రం నియోజకవర్గంలోని ఒక్కొక్క మండలంలో ఒక్కొక్క రోజు వంతున తన సేవలను అందిస్తున్నారు. మొబైల్ మజ్జిగ చలివేంద్రం ప్రధానంగా బస్టాండ్‌లలో ఉన్న ప్రయాణికులు, రోడ్డు పక్కన ఎండలో నిలిచినవారు లేదా ప్రయాణించేవారి వద్దకు వెళ్లి వారికి మజ్జిగను అందిస్తుందని తెలిపారు. సదరు వాహనం బుధవారం భీమడోలు మండలంలోని పూళ్ల, కురెళ్లగూడెం, వడ్లపట్ల, భీమడోలు గ్రామాల్లో తన సేవలను అందించిందని, కార్యక్రమానికి పార్టీ వాలంటీర్లు నియమితులైన జనసేన పార్టీ భీమడోలు మండల నాయకులు ప్రతి మదన్ తెలిపారు.

ఏలూరు అర్బన్ : ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రి సమీపంలో రెడ్‌క్రాస్ మెడికల్ షాపు వద్ద ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ చలివేంద్రంలో రోడ్డుమీద వెళ్లే బాటసారులకు బుధవారం మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బి.వి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు విపరీతంగా పెరిగాయని, రోడ్డుమీద వెళ్లే ప్రజల దాహార్తిని తీర్చాలని ఉద్దేశంతో బుధవారం తానే మజ్జిగను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా దాతలు సహకరిస్తే, ఆరోజు వారి పేరు మీద రెడ్ క్రాస్ చలివేంద్రంలో మజ్జిగను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ ఆర్ఎస్ఆర్కె.ప్రసాదరావు, ఎ.సూర్యనారాయణ, కె.వి.రమణ పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న అంబుల వైష్ణవి

అంబుల వైష్ణవి దాతృత్వం

ప్రజాశక్తి - ముదినేపల్లి

కొంతకాలంగా ఆనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి అమరావతి బ్రాండ్ మాజీ అంబాసిడర్ అంబుల వైష్ణవి బుధవారం అర్థికసాయం అందించారు. ముదినేపల్లి అంబేద్కర్‌కాలనీకి చెందిన చంద్రశేఖర్ (51) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వైద్య విద్యార్థిని వైష్ణవి తన తండ్రి మనోజ్‌తో కలిసి వెళ్లి మృతదేహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.ఐదు వేలు అర్థిక సాయం అందించారు.

నేరాలు - ఘోరాలు

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - చింతలపూడి

మట్టి ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని యర్రంపల్లిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. చింతలపూడి ఎస్ఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని యర్రంపల్లి గ్రామానికి చెందిన యువకుడు అగ్నిపర్తి విజయ్‌కుమార్ (21)కు సొంతగా ట్రాక్టర్ ఉంది. గ్రామంలో మట్టి తోలకాలు జరుగుతుండగా మంగళవారం మట్టి తోలకానికి వెళ్లాడు. ఈ క్రమంలో మట్టి తరలిస్తుండగా ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో విజయ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

కోడివ్యర్థాలు తరలిస్తున్న వాహనం

కోడివ్యర్థాలు తరలిస్తున్న వాహనం పట్టివేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆక్వా చెరువులకు కోడి వ్యర్థాలు తరలిస్తున్న వ్యాన్‌ను బుధవారం సాయంత్రం పోలీసులు స్వాధీనం తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తెనాలి నుంచి ఏలూరు మండలంలోని పైడిచింతపాడు గ్రామానికి కోడివ్యర్థాలు లోడుతో వెళ్తున్న వ్యాన్‌ను ముదినేపల్లి సెంటర్‌లో వాహనాల తనీఖీ చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. వ్యాన్‌ను స్వాధీనం చేసుకొని వ్యాన్ డ్రైవర్ కాకర్ల స్టాలిన్‌రాజును అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షణ్ముఖసాయి తెలిపారు.

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అప్పుల బాధ భరించలేక మనస్తాపానికి గురైన ఒక వ్యక్తి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల ప్రకారం... ఏలూరు రూరల్ బీడీ కాలనీ గట్టు ప్రాంతానికి చెందిన పల్లెల అర్జునకిషోర్ (23) టైల్స్ పనులు చేస్తూ ఉంటాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన అర్జునకిషోర్ మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఈ సంఘటనపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రూరల్ ఎస్ఐ ఎన్.లక్ష్మణబాబు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బుధవారం ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద పంచనామా జరిపి, పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

అసభ్య ప్రవర్తనపై ఫోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన పెచ్చెట్టి గౌతమ్‌కృష్ణపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు. పట్టణానికి చెందిన గౌతం కృష్ణ తనపై కొంతకాలంగా అసభ్యకరంగా ప్రవర్తిస్తూ లైంగికంగా వేధిస్తున్నాడని అతని మరదలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొరకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేశామని ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

చెట్లు నరికివేత.. పట్టించుకోని అధికారులు

కనుమరుగవుతున్న పచ్చదనం
అమలు కాని వాల్టా చట్టం

ప్రజాశక్తి - మండవల్లి

సమస్త జీవ కోటికి ప్రాణాధారం ఆక్సిజన్.. వృక్షాలు అందిస్తున్న ప్రాణవాయువుపై ఆధారపడి సమస్త జీవ రాసులు మనుగడ సాగిస్తున్నాయి. రహదారి విస్తరణతో ఏళ్ల నాటి చెట్లను నరికి వేస్తుండడంతో పచ్చదనం కనుమరుగవ్వడంతో పాటు రహదారిపై నిలువ నీడ లేకుండా పోయింది. దీంతో వేసవిలో జాతీయ రహదారిపై ప్రయాణించడానికి ప్రయాణికులు నానా అవస్థలు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

జాతీయ రహదారికి పామర్రు దిగమర్రు ఇరువైపులా పెద్ద పెద్ద చెట్లు అధికంగా ఉండేవి. పచ్చదనంతో కనువిందు చేయడంతో పాటు ప్రాణవాయువు అందిస్తూ వేసవిలో ఎంతో నీడను ఇచ్చేవి. వాహనదారులు వేసవిలో ఈ చెట్ల నీడ కింద ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేవారు. అంతేకాకుండా వేసవిలో రహదారిపై ఉన్న చెట్ల నీడను ఆధారం చేసుకుని చిరు వ్యాపారులు మామిడి, ఈతచింతకాయలు, సపోటా, తాటి ముంజలు, కొబ్బరికాయలు, జామకాయలు, గోలి సోడా వంటి వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉండేవారు. జాతీయ రహదారి విస్తరణలో రహదారి వెంబడి ఉన్న ఏళ్ల నాటి చెట్లను నరికి వేస్తున్నారు. ఈ నెల ప్రారంభంలోనే ఎండలు అధికంగా ఉండడంతో ఉదయం ఏడు గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీంతో ఉష్ణోగ్రతలు భారీస్థాయిలో నమోదవుతున్నాయి. చెట్లను తొలగించే క్రమంలో విద్యుత్ ప్రసారాన్ని నిలిపివేయడంతో ఉక్కపోతతో గ్రామాల్లోని ప్రజలు అవస్థలు పడుతున్నారు. భారీగా పెరిగిన ఉష్ణోగ్రతలతో ప్రయాణికులు రహదారిపై ప్రయాణించలేని పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో రోడ్డుపైకి వస్తే కిలోమీటర్ నుంచి ఐదు కిలోమీటర్ల వరకు పెద్ద పెద్ద చెట్లు ఉండేవి. చెట్లను నరికి వేయడంతో ఇప్పుడు ఆ పరిస్థితి కనపడటం లేదు. చెట్లను తొలగించాల్సిన పరిస్థితి వస్తే వాటి స్థానంలో ఐదు మొక్కలను నాటి సంరక్షించాల్సిన బాధ్యతను తీసుకోవాలని వాల్టా చట్టం చెప్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆ మేరకు ఎవరూ చర్యలు తీసుకోకపోవడం లేదని ప్రయాణికులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తొలగించిన చెట్ల స్థానంలో మొక్కలను నాటి సంరక్షించి జాతీయ రహదారిపై నీడ కల్పించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు. దీనిపై జాతీయ రహదారుల అధికారి సత్యనారాయణను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

నరికివేతకు గురవుతున్న రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు

తల్లిదండ్రుల త్యాగాలను స్మరించుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మానవత విద్యా నిధి ఛైర్మన్, బాల వికాస్ భారతి ఆర్గనైజేషన్ గౌరవ అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు తల్లి కమలావతి ప్రథమ వర్థంతి సందర్భంగా బాల వికాస్ భారతి ఆధ్వర్యంలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రంలో బుధవారం వృద్ధులకు, బాలలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. బాల వికాస్ భారతి ప్రెసిడెంట్, న్యాయవాది కట్టా సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి పవర్‌పేట వాసు దేవాలయం, చిట్టివలస పాకల ప్రాంతంలోని వృద్ధులు, బాలబాలికలు, ఎఎస్ఆర్ స్టేడియంలో వ్యాయామ శిక్షణ పొందుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. సమాజంలో ప్రతిఒక్కరూ జన్మనిచ్చిన తల్లిదండ్రుల యోగక్షేమాలు జీవితాంతం చూడాల్సిన బాధ్యత, అవసరం ప్రతి వ్యక్తిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరికి తొలి గురువు అమ్మే కావడం అదృష్టంగా భావించాలని సభకు అధ్యక్షత వహించిన కట్టా సత్యనారాయణ తెలిపారు. మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు వారి కష్టాలను దిగమింగుకొని పిల్లల బాగు కోసం, యోగక్షేమాల కోసం నిరంతరం ఆలోచిస్తారని, అలా మన కోసం ఆలోచించే తల్లిదండ్రులను నిరంతరం గుర్తుపెట్టుకోవాలని, వారి ఆలోచనలు, కోరికల ప్రకారం సమాజానికి సేవ చేయాల్సిన అవసరం ఉందని ఆలపాటి నాగేశ్వరరావు అన్నారు. ముఖ్యఅతిథిగా ఫాదర్ బాల, జెఎంజె బిఇడి కాలేజ్ కరస్పాండెంట్ మాట్లాడుతూ జన్మనిచ్చిన అమ్మ త్యాగాన్ని, అమ్మ ప్రేమను ఏ ఒక్కరూ మరువకూడదన్నారు. అనంతరం 15 రోజులకు సరిపడా పౌష్టికాహారం వృద్ధులకు, పిల్లలకు ఆలపాటి నాగేశ్వరరావు అందించారు. బాలవికాస్ భారతి జాయింట్ సెక్రటరీ పి.దుర్గాప్రసాద్ సభకు హాజరైన వారిని వేదికపైకి ఆహ్వానించి, కార్యక్రమం ముగింపులో వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, ఏలూరు మానవత సంస్థ కార్యదర్శి మేతర అజయ్ బాబు, విజ్ఞాన కేంద్రం సభ్యులు విజిఎం కృష్ణారావు, మానవత సంస్థ నాయకులు పి.రత్నాకర్‌రావు, కరుణోదయ మానసిక వికలాంగుల సంస్థ ఛైర్మన్ డొమ్నిక్, బాలవికాస్ భారతి, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, మానవత సంస్థ, లయన్స్ క్లబ్ తదితర సేవా సంస్థల నాయకులు పాల్గొన్నారు.


వృద్ధులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్న నాగేశ్వరరావు

ట్యాంకు వెనుక రంధ్రం గుండా పోతున్న నీరు

ఒకవైపు లోపలికి.. మరోవైపు బయటకు

ప్రజాశక్తి - మండవల్లి

ట్యాంకులోని నీరు ఎటు పోతే మాకేంటి డ్రైనేజీలోని మురుగునీరు ట్యాంకులోకి ఎక్కిస్తున్నామా లేదా అనేది మాకు ముఖ్యం అనే చందాన్ని తలపిస్తోంది ఈ చిత్రం. అటుగా వెళ్తున్న వాహనదారులు, పాదచారులు ఎండ వేడిమిని ఉక్కబోతను కూడా మరిచి ఆహ్లాదంగా నవ్వుకునేలా చేసిన ఈ సంఘటన మండల కేంద్రమైన మండవల్లిలో చోటు చేసుకుంది. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా గుత్తేదారుడు డ్రెయినేజీ పనులను ఇష్టానుసారంగా నిర్వహించి అర్థాంతరంగా నిలుపుదల చేసి వెళ్లిపోయాడు. దీంతో మురుగు పారేందుకు అవకాశం లేకపోవడంతో గ్రామంలోని మురుగు జాతీయ రహదారిపైకి చేరుకుని దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు వ్యాప్తి చెంది అనారోగ్యాల బారిన పడుతున్నామని పంచాయతీకి, గ్రామ సభల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. ఈ క్రమంలో గుత్తేదారుడు ట్యాంకర్ల ద్వారా మురుగునీటిని తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టాడు. ఈ క్రమంలో మురుగు నీటిని ట్యాంకులోకి ఎక్కిస్తూ ట్యాంకు వెనుక ఉన్న విడుదల చేసే పైపును మూయ్యకపోవడంతో ట్యాంకులోకి చేరుతున్న మురుగునీరు వెనుక నుంచి బయటకు వచ్చేస్తున్నాయి. ట్యాంకు పైన కింద సంబంధిత వ్యక్తులు ఉన్నప్పటికీ పరిస్థితిని గమనించకపోవడంతో గంటల తరబడి ట్యాంకులోకి నీరు చేరుతూనే ఉన్నాయి బయటకు వస్తూనే ఉన్నాయి. ఈ తతంగం ముందుగా ఎవరికీ అర్థం కాకపోయినప్పటికీ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసినప్పటికీ తర్వాత తెలిసి నవ్వుకున్నారు.

విభిన్న ప్రతిభావంతుడికి వీల్‌ఛైర్ అందజేత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి టిడిపి ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఆ పార్టీ నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని మర్రిబందం గ్రామానికి చెందిన షేక్ మస్తాన్, ఖాజాబీ కుమారుడికి అదే గ్రామానికి చెందిన టిడిపి నాయకులు తిరుమరెడ్డి నాగరాజు, సంసారపు భాస్కరరావు, వజ్జ రాము, కన్నికంటి పెరుమాళ్ళు, ఏనుగు గణేష్, కన్నికంటి రుష్యరావు సంయుక్తంగా వితరణగా ఏర్పాటు చేసిన వీల్‌ఛైర్‌ను ముద్దరబోయిన వెంకటేశ్వరరావు బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముసునూరు రాజా, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి వై.సత్యనారాయణ, ఏలూరు పార్లమెంట్ తెలుగు యువత నాయకులు గోగినేని మధు కిరణ్, యనమందల దాసు, కనికంటి శ్రీను, వజ్జ భరత్, అవిర్నేని పద్మాకరరావు, సిద్ధయ్య, షేక్ సుభాని, శివ పాల్గొన్నారు.

కానుకొల్లులో ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

ప్రజాశక్తి - మండవల్లి

ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న సర్పంచి

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని కానుకొల్లు సర్పంచి నాగ దాసి థామస్ తెలిపారు. కానుకొల్లులో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలసలను నిరోధించే విధంగా గ్రామంలోనే ఉండి పనులు చేసుకుని జీవించేలా ఉపాధి పనులను తీసుకొచ్చినట్లు చెప్పారు. సిబ్బంది కూడా అందుబాటులో ఉంటూ కూలీలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచుకుని పనులు నిర్వహించేలా చేయాలన్నారు. అనంతరం నిర్వహించనున్న పనులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ గణపతి, కూలీలు పాల్గొన్నారు.

కలిదిండిలో...

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

కలిదిండి : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో పర్యావరణ పరిరక్షణ అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని చిత్రాలు గీశారు. అనంతరం స్వతంత్ర సమరయోధుల గురించి వివరించారు. శాఖా గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు, ఉపాధ్యాయులు డి.వి.నరేష్, కె.శ్రీనివాస్, శివాజీ, పురుషోత్తం పాల్గొన్నారు.

ముదినేపల్లి : ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు బుధవారంతో పదోరోజుకు చేరాయి. ఈ సందర్భంగా విద్యార్థులతో కథలు, పుస్తకాలు చదివించడం, దశావతారాలు ఎన్ని ఒక్కొక్క అవతారం గురించి వివరించారు. పరసా వర్షిణి ఇంగ్లీష్ గ్లామర్ చెప్పారు. అనంతరం విద్యార్థులతో ఇండోర్ గేమ్స్ ఆడించినట్లు గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సిహెచ్.నాగరాజు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

స్థానిక జెడ్‌పి స్కూలులో బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమం జరిగింది. 2002-2003 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులంతా ఒకచోట చేరి ఆటపాటలతో సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులు రాంబాబు, వై.విజయకుమార్, విజయలక్ష్మి, పద్మావతి, బాలకృష్ణలను సత్కరించారు. దినేష్, వనిత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

ప్రజాశక్తి - మండవల్లి

గ్రామంలోని ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకున్నామని అప్పాపురం సర్పంచి బుర్ల భోగేశ్వరరావు తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామంలోని ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామంలో ఉన్న బావిని పూర్తిస్థాయిలో ఎల్ల వేయించినట్లు తెలిపారు. అంతేకాకుండా అవసరమైన చోట చేతి బోర్లను వేయించి తాగునీటి అవసరాలను తీర్చే విధంగా చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు.

బాల్య వివాహాల నివారణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - కామవరపుకోట

బాల్య వివాహాల నివారణకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూపర్‌వైజర్ మంగాదేవి చెప్పారు. కామవరపుకోట అంగన్‌వాడీ సెంటర్‌లో బాల్య వివాహాల నివారణపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగాదేవి మాట్లాడుతూ బాల్య వివాహాల అనేక అనర్థాలు వస్తాయని చెప్పారు. గ్రామస్థాయిలో విఆర్ఒ, విఆర్ఎ, కార్యదర్శి, ఎఎన్ఎం, అంగన్‌వాడీ వర్కర్లు కమిటీగా ఉంటారని, ఈ కమిటీ దృష్టికి తీసుకొస్తే బాల్య వివాహాల నివారణకు చర్యలు తీసుకుంటారని చెప్పారు. ప్రతిఒక్కరూ బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.శాంతకుమారి, వి.భాగ్యలక్ష్మి, పి.రత్నకుమారి, బి.ఎస్తేరురాణి, ఎన్.మరియరాణి, ఎం.పెంటమ్మ, కె.పుష్పవతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వైసిపి విధానాలతో రైతులకు కష్టాలు : టిడిపి

ప్రజాశక్తి - పోలవరం

వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులు కష్టాల పాలవుతున్నారని టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు విమర్శించారు. కొత్త పట్టిసీమ గ్రామంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో వరి కుప్పలు దగ్ధమైన ప్రాంతాలను ఆయన బుధవారం పరిశీలించి, రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కొత్త పట్టిసీమ గ్రామంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలు, ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవటం, అధికారులు గోనె సంచులు ఏర్పాటు చేయకపోవటం వల్ల రైతులు పండించిన వరి పంటను రైతులు తమ పొలాల్లోనే కుప్పలు వేసుకున్నారన్నారు. అగ్ని ప్రమాదంలో 40కి పైగా వరి కుప్పలు పూర్తిగా దగ్ధమయ్యాయన్నారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంట కాలి బూడిదై దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, రైతుల ఆవేదన వర్ణనాతీతమని చెప్పారు. అగ్ని ప్రమాదంలో కాలిన వరి పంటకు ప్రభుత్వమే బాధ్యత వహించి నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులతో మాట్లాడి అధైర్య పడవద్దని, రైతులకు అండగా తెలుగుదేశం పార్టీ ఉంటుందని, న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షులు కుంచె దొరబాబు, పార్టీ మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణ, మాజీ మండల అధ్యక్షులు పాపోలు గణపతి రత్తయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు పతివాడ శ్రీనివాస్, టౌన్ పార్టీ అధ్యక్షులు పోతుల శ్రీనివాస్, నియోజకవర్గ తెలుగుమహిళా అధ్యక్షురాలు కుంజం సుభాషిణి, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు గుబ్బా రాంబాబు, పాదం ప్రసాద్, జల్లేపల్లి పెద్దబ్బులు, ఆకుల రాజా, కొవ్వాసి శ్రీను, పివివి.సత్యనారాయణ, మైగాపుల మాధవరావు, వలవల శ్రీను, దవల వీరన్న, పూడి అప్పారావు, పూడి వెంకట్రావు, నాగేంద్ర ఉన్నారు.

పోలవరం : మండలంలోని కొత్త పట్టిసీమలో మంగళవారం సంభవించిన అగ్నిప్రమాదంలో వరికుప్పలు దగ్ధమైన ప్రాంతాన్ని జనసేన పార్టీ మండల అధ్యక్షులు వనపర్తి వీరవెంకటసత్యనారాయణ (చిన్ని) బుధవారం పరిశీలించి, నష్టపోయిన రైతులను పరామర్శించారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కారటం సాయి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు సూచనల మేరకు పరిశీలించామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయినవారు సన్న, చిన్న కారు రైతులని చెప్పారు. రైతులకు ప్రభుత్వం పూర్తి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐటి వింగ్ కో-ఆర్డినేటర్ ఆటపాకల వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు తెలగంశెట్టి రామప్రసాద్, కురుసం రమేష్, మండల కార్యదర్శి కనుమర్లపూడి నాగేశ్వరరావు, చీకట్ల సాయికృష్ణ, సునీల్, జనసేన నాయకులు నాగిరెడ్డి నాగేశ్వరరావు, కరిబండి రాజు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తరచూ మరమ్మతులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం వైఎస్ఆర్ కాలనీ రెండో వీధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తరచూ మరమ్మతులకు గురవుతోంది. దీంతో వినియోగదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ వారం రోజుల వ్యవధిలో ట్రాన్స్‌ఫార్మర్ రెండు సార్లు మరమ్మతులకు గురైంది. ఒక పక్క రాత్రిళ్లు ఎండలు, ఉక్కపోతకు తోడు కరెంటు లేకపోవడంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కోసం ప్రతిపాదనలు పంపామని, మంజూరు కాగానే పాతది తీసేసి కొత్తది బిగిస్తామని చెబుతున్నారు. కొత్తది వచ్చేంతవరకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తొలగించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

7వ కౌలు రైతు సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి - చింతలపూడి

వచ్చే నెల మూడో తేదీన మండలంలోని మల్లాయిగూడెం గ్రామంలో జరుగుతున్న కౌలు రైతు సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ పిలుపునిచ్చారు. పట్టణంలోని సిపిఐ కార్యాలయం వద్ద కౌలు రైతు సంఘం జిల్లా మహసభ కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ జిల్లా మహాసభలో తీర్మానాలు, చర్చల ద్వారా భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి రావెళ్ల రాజ్య, రైతు సంఘం నాయకులు తక్కెలపాటి ప్రసాద్, తాడిగడప మాణిక్యాలరావు, శంకు సత్యనారాయణ, సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య పాల్గొన్నారు.

ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రయివేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యోగ, కార్మికులు పోరుబాట పట్టాలని ఎఐటియుసి జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయం వద్ద కూనపాముల విఘ్నేష్ అధ్యక్షతన ఎఐటియుసి ప్రథమ మండల మహాసభ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక చట్టాలను కాపాడుకోవడానికి దేశంలో ఉన్న యావత్ కార్మిక వర్గం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సిపిఐ మండల కార్యదర్శి జెవి.రమణరాజు ఎఐటియుసి మండల నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు అయితా సురేష్, పి.బాలకృష్ణ, మండల కమిటీ సభ్యులు చిట్టూరి వెంకటేశ్వరరావు, హమాలీ కార్మిక సంఘం నుంచి రామకృష్ణ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో హాల్‌టిక్కెట్లు

ప్రజాశక్తి - చింతలపూడి

గురుకుల పాఠశాలలో 5, 6, 7, 8 తరగతులకు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 2023-24 విద్యా సంవత్సరం ప్రవేశ పరీక్షలకు హాల్ టిక్కెట్లు విడుదల చేసినట్లు నాగిరెడ్డిగూడెం బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సురేష్‌బాబు తెలిపారు. విద్యార్థి ఐడి, పుట్టిన తేదీలతో హాల్‌టికెట్ పొందవచ్చని తెలిపారు. ఈ నెల 20వ తేదీ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రానికి గంట ముందు చేరుకోవాలని తెలిపారు.

మట్టిని అక్రమంగా తరలిస్తే చర్యలు

ప్రజాశక్తి - చాట్రాయి

అనుమతులు లేకుండా చెరువుల్లో, ప్రభుత్వ భూముల్లో మట్టిని తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ సిహెచ్.విశ్వనాధరావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఎవరైనా మట్టి తరలింపునకు అనుమతులు తీసుకోవాలని, లేకపోతే చట్ట ప్రకారం తీసుకుంటామని పేర్కొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE 1st ADDITIONAL DISTRICT JUDGE cum M.A.C.T. AT SRIKAKULAM.
I.A.115/2023 in M.V.O.P. 57/2022.

Between: S(Ch)iguruvalasa Dalamma & 4 others ...Petitioners.
And:Mamidi Dhanaraju & 2 others ...Respondents.

To:R-1 Mamidi Dhanaraju, S/o late Dalayya, 43 years, Kalinga by Caste, Driver of Car No.AP-37-BF-4033, Peravali Road, Indrayya Nagar, Tanuku Old Town, West Godavari District, Andhra Pradesh State.
R-2 Sri Nitai Karmokar, Son of N.Sukder Karmokar, aged 52 years, Owner of Car bearing No.AP-37-BF-4033, resident of Door No.27-11-12, Kameswarivari Street, Tanuku Town, Post & Mandal, West Godavari District.

NOTICE

That the above named Petitioners has filed the above O.P. for claiming compensation under M.V.Act, against you and another and the same is posted to **24-05- 2023** for your appearance before the Honourable Court. Therefore you are hereby directed to appear before the Honourable Court on **24-05-2023 at 10-30 A.M.,** either in person or through an Advocate, failing which the matter will be decided as per Law in your absence.

(By order of the Honourable Court)

KARRI.SESHAGIRI RAO,
Advocate,Srikakulam.
Mobile:9542637477.